

## దీపావళి కథల పోటీలో
## మొదటి బహుమతి పొందినది

**"బావా,**

ఎంత ఖంగారులో వ్రాసినా నీ పాదపద్మాలకు నమస్కరించకుండా వ్రాస్తానని మాత్రం అనుకోకు! నాకు ఎప్పుడూ ఖంగారే అనీ, ఏదో ఒకవైపునుండి ఒత్తిడే అనీ, అంటావు! కానీ... నీ హృదయానికి తెలియదూ?

తెలుసు. 'నీకెలా తెలిసిందీ ఆ సంగతి' అని తిరిగి ప్రశ్నిస్తున్నట్లున్నావు...నీవు ఇక్కడినుండి వెళ్ళేముందు నీ హృదయాన్ని ఇక్కడే అట్టే పెట్టి నా హృదయాన్ని తీసుకుని వెళ్ళిపోవడం నీకు పరిపాటే అయినా, ఆకరకు కత్తుల ధ్వనిలోనూ, తుపాకీల మ్రోతలోనూ, ఆ సంగతి మరిచిపోయి 'నీకెల్లా తెలుసూ?' అని ప్రశ్నిస్తూంటావు!! నీ హృదయం నా దగ్గరే ఉండిపోయినప్పుడు నీ విషయాలు నాకు తెలియకుండా ఉంటాయా?

*విధ్యుక్త ధర్మ నిర్వహణానికి మన స్మృతితో నిమిత్తంలేదు. కాని మనసు కరిగే స్థితి ఎప్పుడు అయినా తటస్థించవచ్చు. కర్తవ్యం నిర్ణయించుకొనడంలో మేథకు స్థానం ఉండదు.*

---

అవును గానీ—నేను నీకు చాలా ఉత్తరాలు వ్రాశానే. కొన్ని కొన్నింటికి జవాబు వ్రాసి.... కొన్ని కొన్నింటికి అసలు వ్రాయనే వ్రాయవు... అందులో నేనీ మధ్య వ్రాసిన ఉత్తరాలకి జవాబులే లేవు. కారణం ఏమిటి బావా? కోపం వచ్చిందా నామీద??

అసమర్థతను అసహ్యించుకోకూడదు బావా. నీదాన్నే కాబట్టి సవరించ యత్నించు.

'ఇంత పెద్ద కబుర్లు చెబుతున్నావు. నా హృదయం నీకా విషయం చెప్పనేలేదా?'—అని ప్రశ్నిస్తున్నట్లున్నావు. నీవలా మాటి మాటికీ ప్రశ్నించడం నాకూ ఇష్టమే. ఇష్టమైనవన్నీ ఆలోచిస్తూ కూర్చున్నంతమాత్రాన కష్టాలను దాటెయ్యగలమా బావా? కష్టాలను మరిచి పోగలం....అంతే!

# దీపం పురుగులు

పి. లీల

నా ఉత్తరాలు అందటల్లేదా నీకు ? ? అదో పెద్ద కారణం...అందలేదంటే 'పీడా పోయింది' అనుకుంటున్నావేమో! ఇన్నాళ్లూ 'నిన్ను పీడలానే పట్టుకుని వదలను' అనుకునే దాన్ని. కానీ, ఈనాడు అనిపిస్తూంది—'పీడకల కంటె ఎక్కువ కాలేనేమో'—అని. కనీసం నీ జవాబులు చూపించైనా మావాళ్లని అనగలను. మరి నీ ఈ నిశ్శబ్దాన్ని ఏమని నిర్వచించమని నీ ఉద్దేశ్యం ?

నాన్న అంటారు — 'అమ్మా...మిలిటరీలో చేరాక...మనుష్యులు మన మనుష్యులు కారమ్మా.. మర్చిపోవాలి...నీకు వచ్చే సంబంధాలు నే తీసి కొస్తాగా' అని. అమ్మ సరే సరి....'దిక్కులేక దిక్కులెట్టుకుని పారిపోయినవాడినే తలుచుకుంటూ ఏడవకపోతే తల్లీ, తండ్రీ అనీ, పెళ్లని సుఖపెట్టాలనీ ఆలోచన వచ్చిన రోజునే నీ జీవితం బాగుపడుతుందనీ అంటూంది. అన్న, అక్క ..చెప్పక్కరలేదు. చిట్టి తమ్ముడుమాత్రం ఏమీ మాట్లాడడు.

బావా! జీవితంలో పెద్ద ఘనకార్యాలు సాధించాలనీ, జీవితాన్ని బాగుపరచుకోవాలనీ, అలాంటి కోరిక లేమీ లేవు నాకు. నీ పాదపూజ చాలు. కాలాన్ని మరిచిపోతా! నీ హృదయ పీఠం చాలు. గతాన్ని మరిచిపోతా ! ! అదే నాకు దొరకదేమో అని అనుక్షణం మనస్సు మథనపడుతూంటుంది. అంత శిలాహృదయుడవై పోయావా? శరీరాన్నే శిలగా మార్చగలరు కానీ మిలిటరీ వాళ్ళు మనస్సులను కూడా మార్చగలరని అనుకోలేదు. అందుకనే—

'నీ మనస్సులో నా దీపాన్ని వెలిగించి వెడుతున్నా. ఈ వెలుగును వెతుక్కుంటూ ఎక్కడ ఉన్నా తిరిగివస్తా. జీవితంలో ఏదో సాధించి నీకోసం తెస్తా. ఇది నాకోసం కాదనీ, నా జీవితాంతం తోడునీడనై, జన్మ జన్మాలకూ నా దానివైన నిన్ను సుఖపెట్టడానికే అనీ, ఇదే దీపం ఎదురుగా ప్రమాణం చేస్తున్నా' అంటూ చేతిలో చెయ్యేసి, చెక్కిలిమీద చిటికేసి, నీవు వెళ్లిపోతూంటే కళ్ల నీళ్ళెట్టుకుని, నీ పాద ధూళిని శిరస్సున ధరించడం తప్ప ఏమీ చెయ్యలేకపోయాను. నీవు చేతిలో చెయ్యి వేస్తున్నప్పుడు నీ చేతిని పట్టుకున్న ఈ చేతిని మరోచేతికి అందించాలనీ, ఒకసారి మొదటిసారిగా నీ పాద ధూళిని ధరించిన ఈ నేను తిరిగి మరో పాదాలను స్పృశించాలనీ, నిన్ను పెనవైచుకున్న నా మనస్సును బలవంతంగా విడదీసి మరో ఆధారాన్ని చేసికోవాలనీ, అమ్మావాళ్లూ శాసిస్తూంటే ఏంచెయ్యను, బావా? ఏదీ చెయ్యలేను.

ఏదో ఒకటి చెయ్యాలి...ఏదో ఒకటికాదు.... వాళ్లకి నచ్చిందే చెయ్యాలి.

అదే నేను చెయ్య ( లే ) నిది.

అపమర్త్యురాలిని.

నా చిన్నతనంలో తోటమాలిని చూసి, మనసుపడి, ఎవ్వరూ చూడకుండా, మూలగా,





# దీపం పురుగులు

ఓసారి చిక్కుడు విత్తులు నాటాను! విత్తనం మొలకెత్తింది!! సంతోషంతో ఎగిరి గంతేసి, దానికి కావలసిన సదుపాయాలకోసం మహా తాపత్రయపడి, ఒక చిన్న కర్రముక్క సంపాదించి దానిచుట్టూ త్రిప్పాను. అది పెద్దదయ్యాక, మూలగా నాటడం వలన స్థలం చాలదనీ, చిన్ని కర్ర ముక్కకి చుట్టడంవలన పొడుగు చాలదనీ, అనిపించి, విశాలంగా ఉన్నచోట పాతి, పెద్ద పందిరిమీదికి ప్రాకించాలని నేను ప్రయత్నాలు చేస్తుంటే, అమ్మ అందీ—'హేమా....ఓసారి అల్లుకునిపోయినదానిని విడదీయడం కష్టం. చిన్నదో, పెద్దదో...దానికి తెలియదు! ఇప్పుడు పెద్ద గడచుట్టూ నీవు త్రిప్పాలన్నా లాభం లేదు. అలాగే మరోచోట పాతుదామనుకుంటున్నావు. అదీ అంతేను. పాదులనీ, లతలనీ, మరో చోట, మరోచోట అంటూ తిరిగి తిరిగి పాతలేము. విత్తులు నాటేముందే ఆలోచించుకోవాలి గానీ, స్థలం మార్చాలంటే చచ్చిపోతాయి' అని.

అప్పట్లో సరిగ్గా అర్థం కానేలేదు నాకు. ఆ తర్వాత పదో క్లాసులో మా తెలుగు మేష్టారు 'కళలకీ, లతలకీ, ఆడవారికీ ఆధారం ఉండాలనీ, లేకపోతే శోభించరనీ—'అన్నారు. అప్పుడు అమ్మ చెప్పిన దానిని దీనికి జతచేస్తే ఒకసారి నిన్నాధారం చేసుకున్న. నేను తిరిగి ఎలా బావా, మరో ఆధారాన్ని అల్లుకోవడం?

అప్పుడైతే అమ్మ చిక్కుడు పాదును గూర్చి 'ఒకసారి అల్లుకున్నాక విప్పడం కష్టం అనీ, విప్పినా కొంత అయినా నష్టం, నాశనం జరుగుతుందనీ, ఆ తర్వాత అయినా అది తిరిగి దేన్నీ పట్టుకుని ప్రాక (లే) దనీ, అలాగే నేలమీదే ప్రాక్కుంటూ బ్రతుకుతుందనీ' అంది గానీ...ఇప్పుడు ఒప్పుకుంటుందా? మొక్కలైతే స్థలం మార్చినా బ్రతుకుతాయి అని చెప్పింది. ఈనాటి నీ మౌనం చూస్తే మొక్కలకీ, మొగజాతికీ చాలా పోలికలున్నాయనిపిస్తోంది! అని దేన్నీ ఆధారం చేసికో నక్కరలేదు మరి !

తమాషా ఏమంటే, చిన్నతనంలో మనకు చెప్పిన విషయాలనే మనం పెద్దయ్యేటప్పటికి మార్చేస్తారు ఈ పెద్దలు! ఏమో...వాళ్లందరినీ అనుకుని ఏమి లాభం? ఒక్కోసారి అనుకునేదాన్ని...'మోడును చుట్టుకున్న లతని విప్పగలం కానీ—ఆకులతో, కొమ్మలతో, ఫలాలతో కలకలలాడే వృక్షాన్ని పెనవైచుకున్న తీగను విప్పగలమా' అని. నాకు నేను దానితో పోల్చుకుని తృప్తిపడేదాన్ని! అంతలోనే—అంతగా విడదీయ యత్నించినా, ఆ వృక్షాన్ని నరికితేనేగాని లతని విప్పలేరనీ, వృక్షాన్ని నరికే పక్షంలో లతకు కూడా నష్టం తప్పదనీ, ఈ రెండింటి నాశనాన్ని ఎవరూ కోరరనీ, నందనవనాన్ని స్మశానవాటికగా మార్చే మనుష్యులు ఉండరనీ సమాధాన పడేదాన్ని!!

కానీ, ఈనాడు నీ ఈ మౌనాన్ని చూసి నేను మోడుకు అల్లుకున్నాననివిడదీసెయ్యారూ? నీ కీ ఆలోచనే రాలేదా మరి? నాకు నమ్మకం ఉన్నంతమాత్రాన నములు జరుగుతాయా? అది మరిచిపోయి నేను నీకోసం ఎన్ని యుగాలైనా ఎదురుచూస్తూంటానని భరోసాలో ఉండి ఉంటావు నువ్వు!

నిరీక్షణంలో మాధుర్యం, సంతోషం ఎంతెంతో, వేదన కూడా అంతే. కానీ, కాలపరిమితి దాటితే, నిరీక్షణ తెచ్చే ముప్పులు ఎన్నెన్నో ఉంటాయి. చంద్రుడికోసం ఎదురు తెన్నులు చూచే కలువ అమావాస్య రాత్రిళ్ళు గడపడం లేదూ మరి? ఆ మర్నాడు ముసురూ—గాలీ—వర్షం—తుఫానూ వచ్చి, ఆ కలువ కన్నెకాలి చంద్రుని దర్శనం దుర్లభం అయినపుడు సగం వాలిపోయినా, రేపు మీద ఆశతో జీవిస్తుంది. మరో రెండు రోజులవరకూ తుఫాను ఆగకపోతే ఆ కలువ వాడి, వాలిపోతుంది. దాని జీవనమాధుర్యమంతా చంద్రకిరణాల్లోనే ఉంది. అంతేకాదు. దాని జీవన కాలపరిమితి తక్కువ. అంత తక్కువైనా నిరీక్షణలోనే గడిపింది. ఆ తర్వాత నిండు పున్నమి అయినా బ్రతుకదు. చంద్రుడు తన ఒడిలోకి తీసుకుని వేలు కిరణాలతో తట్టి లేపినా కన్ను తెరవదు. అయిపోయింది దాని జీవితకాలం.

అలాగే, నేనూ కాకుండా ఉండాలని అనుకున్నా. కానీ, చివరి గడియలు సమీపించేలోగా నీవు వస్తే, నీ రాక నా చివరి గడియలను పొడిగించవచ్చునని ఆశామాత్రం మిగిలింది నాకు.

ఇంత పెద్ద ఉత్తరం ఎప్పుడూ వ్రాయనిది వ్రాసిందేమా అని ఆలోచిస్తున్నావా? మరి నేను ఆఖరున వ్రాసిన వాక్యాలను ఏమని అర్థం చేసికున్నట్లు?

అత్తవారింటికి వెళ్లిపొయ్యే ఆడపిల్ల అంత వరకూ పెరిగిన పరిసరాలను వదిలి వేరేచోటికి వెళ్లిపోతాననే భయంతో కనిపించిన ప్రతి మని

షినీ పదిసార్లు చూస్తుంది ! ప్రతి వస్తువూ గుర్తుంచుకుంటుంది ! ! ప్రతి సంఘటనమూ జ్ఞప్తి చేసికుంటుంది ! ! ! అంతవరకూ నిర్లక్ష్యం చేసిన పరిసరాలన్నింటినీ పదే పదే గమనిస్తుంది!!!! తిరిగి తిరిగి మాట్లాడుకునేందుకు ఈ మనుష్యులు దొరకరని భయం కలిగినపుడు ఏదో, ఏదేదో, కొన్ని నెలలకి సరిపడా మాట్లాడెయ్యాలని ప్రయత్నిస్తుంది. నోరు మూగపోతుంది. గొంతు గద్గదికమౌతుంది. కళ్ళు ఏ విషయాన్నీ దాయలేక అప్పు పడిపోతూంటాయి.

ఆ—లా—గే—ఇక నేను జీవించ (లే) నని అనిపించినపుడల్లా పరిసరా లన్నిటినీ పరికిస్తున్నాను. ప్రతి మనిషి మొహాన్నీ పదే పదే చూస్తున్నాను. వీళ్లంతా అందుబాటులో ఉన్నారు కాబట్టి నీతో కూడా, వచ్చే జన్మవరకూ సరిపడా మాట్లాడేసుకుందామని ఉంది.

మనిషిని దుర్లభం ఇన్నాళ్లూ! దర్శనం దుర్లభం ఈనాడు! అందుకనే ఇంత పెద్ద ఉత్తరం వ్రాస్తున్నాను.

దీని జవాబు అందేవరకూ భరోసా ఇవ్వగలను నా ఉనికి !

నీ
హేమ.''

వణుకుతూన్న చేతులతో ఉత్తరం విప్పిన సుబేదార్ రామ్‌సింగ్ సంతకం చూసి దిగాలు పడిపోయి, అంత నిస్సత్తువలోనూ మిగిలిపోయిన బలాన్ని కూడదీసుకుని, చదువుతూనే కూలిపోయాడు కుర్చీలో.

ఇదే చేతివ్రాతతో...ఈ హేమ వ్రాసిన ఉత్తరాలన్నీ గతంలోని జరీ పరదాల్లా మెరిసిపోయాయి. డ్రాయరుమీద కట్టలకొద్దీ ఉత్తరాలు పడి ఉన్నాయి. ఒక్కొక్క ఉత్తరం చదువుతూంటే గుండె చెరువైపోయే ఘట్టాలు బయట పడుతూంటాయి. ఒక్కొక్కటి పూర్తయేసరికి అశ్రువులు ధారాపాతంగా కురిసిపోతూంటాయి. మరొక్కటి గుండెలను కుదిపేస్తూంటుంది. వేరొక్కటి వెనుకటి మధుర స్మృతులను ఒక్కసారిగా ఒక్కొక గాలితెరలా మోసుకొనివచ్చి మరో గాలితెరలో లొక్కువెళ్లిపోతూంటుంది.

ఇంకొకళ్ల ఉత్తరాలు చదవడంలోని నైచ్యాన్ని చిత్రమైన కథలో చెప్పారు మేస్టారు ఒకసారి.

''ఒకసారి ఒక ఎల్లయ్య కూర్చుని ఉత్తరం వ్రాసుకుంటున్నాడుట. సగంవరకూ చాలా చాలా సరదాగా వ్రాస్తూ ఏదో విషయాన్ని అప్పుడే కనిపెట్టినట్లు అమాంతంగా ఆ వాక్యాన్ని పూర్తి చేసేసి, 'నేనింకా చాలా విషయాలు వ్రాయాలనుకున్నాను. కానీ, నా వెనుకనుంచి ఓ మర్యాద లేని గాడిద ఈ ఉత్తరాన్ని చదువుతూండడం వలన సగంలో ముగిస్తున్నందుకు మరేమీ అనుకోకు!' అని వ్రాసి సంతకం పెట్టేశాట్ట.

ఎంతో శ్రద్ధగా పాపం వెనకనుండి చదువుతూన్న పుల్లయ్య మొగం మాడిపోయిందట. ఏమని అడుగుతాడు? మనస్సులో లెంపలు వాయించుకుని నిశ్శబ్దంగా నిష్క్రమించాట్ట!''

కథ మదిలో మెదిలేసరికి చిన్నగా నవ్వు వచ్చింది రామ్‌సింగ్‌కు. మొదట తను ఈ పనిలో చేరేటప్పుడు ఎంతగానో మధనపడ్డాడు. కానీ, విధి వేసిన సంకెళ్లు బలమైనవి. ఎంత బలవత్తరమైనవి కాకపోతే, ఆత్మకు సుతరామూ నచ్చని పనిచేయవలసివచ్చిందో! బంధువుల దగ్గరినుంచి వచ్చే ఉత్తరాలు తిన్నగా సైనికులకు చేరనివ్వరు. ఉద్రేకం కలిగించేవీ, బాధపెట్టేవీ, దిగులు పుట్టించేవీ—మొదలైనవి అందుకుంటే దేనికైనా తెగించేస్తారని భయం! ఎంత తెగించక పోతే సైనికోద్యోగిగా చేరడానికి ఒప్పుకుంటాడో కదామరి!

చేతిలో ఉత్తరం గాలికి రెపరెప లాడింది, తన ఉనికిని జ్ఞాపకం చేస్తూ. ఉలిక్కిపడి చేతిలో ఉత్తరం చూస్తూనే, తిరిగి గతంలోకి జారి పొయ్యాడు సుబేదార్.

కొన్ని కొన్ని జోలపాటలు కొంత కొంత మంది పాడితే గమ్మత్తుగా ఉంటాయి. నిద్రలో ఉన్న మనిషిని మేలు కొలుపుతూనే జోకొట్టేస్తాయి. పాట విని మేల్కొంటూనే తిరిగి.... అలా అలా నిద్రపోతారు. అదే చేసింది చేతిలోని ఉత్తరం. ఇదే హేమ వ్రాసిన ఉత్తరం మొట్టమొదట రోజున ఏం చిలిపిగా కవ్వించిందీ గుర్తుకు వస్తుంటే—

కొంచెం పొట్టిగా పరికిణీ—
ఒంటికి అతుక్కునేలా జాకెట్టూ—
గాలికి ఎగిరి పోతూన్న వోణీ—
బారెడు జడ చివర్న కుచ్చులూ—
తల్లో ఫక్కుమని నవ్వుతూన్న విరజాజులూ—
చెవుల్ని తకుక్కుమనే జూకాలూ—
కాళ్లకి పాంజేబులూ—
వెలికన్నుల్లోని చిలిపితనమూ—
బుగ్గ సుడుల్లో దాక్కొంటున్న కొంటెతనమూ—
సిగ్గును దాచుకోలేక విడివడుతూన్న పెదాలూ—
వీటన్నిటినీ అధిగమిస్తూ చిరుగాలికి కదలాడే ధ్వజస్తంభపు మువ్వల గలగలలా నవ్వూ—
ఒక్కసారిగా మనోవీధిలోకి వచ్చి జారిపోయింది బొమ్మ!!

* * * *

''నా కలల్లో గుడి కట్టుకున్న దైవానికి—, నమస్కారములు. నేను కావలసినంత కులాసే. మీరు కూడా కులాసే అని తలుస్తాను. ఏయ్ అబ్బాయ్—నా కలల్లో గుడి కట్టుకున్న దైవానికి అని సంబోధించేనుకదా అని...గర్భ గుడిలో దేముడిలా అలా స్తంభించి పొయ్యేవేమిటే? ఓహో....దేముడు కూర్చున్నట్లు కూర్చోవాలనే ఆ శ్రమంతా. ఎందుకో! దేముడికి పెట్టినట్లు గానే దండాలు పెడుతున్నామగా! ఇంకా దేముడికి కావాలని తాపత్రయం దేనికీ? ఇంతకన్న దేముడికి మిగిలేవి ఈకాలంలో లేవు. అయ్యో! మరిచిపోయా. మారని చిల్లర డబ్బులు కూడా దేముడికిస్తూంటారులే. అవి కూడా కావాలా? వాటికేం మహద్భాగ్యం అనకు. గుడ్డి ముష్టివాడు దొరకనప్పుడే అవన్నీ దేమునికి దక్కేది. తెలిసిందా?

ఆ...ఇంతకీ—ఏదీ — వెళ్తూనే రాస్తానంటూ వెళ్లి ఇరవై రోజులు దాటిపోయినా ఉత్తరం వ్రాయనేలేదేం? చాలా బిజీగా ఉన్నాననుకుంటున్నావులే ! !

లెఫ్ట్, రైట్ మార్చింగా?

నాకు అందుకనే మిలిటరీ వాళ్లంటే కోపం..

వాళ్లకి తెలియకుండా మార్చింగ్ చేయిస్తూ మిమ్మల్నిక్కడ వరకూ తీసికొచ్చారనుకో! (అనుకోవయ్యా—అనుకుంటూ హాయిగా ఎంతమంది ఉండట్లేదే? ) ఈలోగా నేను కనిపించేననుకో అలాత్తుగా...అప్పుడు పీఛేముడ్ అంటూ వెనక్కి తిరగమనేసరికి ఒకసారి తిరిగిపోయి అటువైపు మార్చింగ్ ప్రారంభించేస్తారు!

వాళ్ల కసలు హృదయాలక్కరలే—శరీరాలు తప్ప ! !

ఉక్కు మనిషైతే మరీ మంచిదిట! ఇక ఉంటా బాబూ...నిద్ర వస్తోంది! నిద్రలోకి వస్తావా?

నీ
హేమ.''

పి. ఎస్. :

''బావా,

అంతవరకూ రాసేనా? నిద్రవచ్చేసరికి కలల్లోకైనా నీవు వస్తావేమోనని నిద్రపోతే కలల్లోకైనా రాలేదేం? తెల్లవారకట్ట వచ్చిన కలలు నిజమవుతాయంటారు. పోనీ, ఒక తెల్లారకట్ట రాకూడదూ? వూహూ. కోరినవన్నీ తీర్చనివాడే దేముడు! అందుకనే అలా సంబోధించేను నేను నిన్న రాత్రి నిన్ను.

కలల్లో గుడి కట్టుకోవడ మేమిటీ— అంటున్నావా? నీకు తెలియదులే. ఇలా నీకు తెలియకుండా నీవు చేసే పనులనే—సైన్సులో 'అసంకల్ప ప్రతీకార్య చర్య'లంటారు!

ఓ శుభముహూర్తంలో, నే నో రోజున, కలల్లో గుడి కంటున్నాను. ఇంతలో నాకు పరిచయం ఉండీ పరిసరాల్లో లేని ఆకారం ఒకటి, నే కట్టుకున్న గుడిలోనికి ప్రవేశించింది! పూజారి లేని గుడి, ఎవరిష్టం వాళ్లది—అనుకుందేమో ఆ ఆకారం !

గర్భగుడిలోనికి వెళ్ల నివ్వవద్దని నేను అనుకుంటూండగానే, అడుగు పెట్టేసింది. నేను కుతూ[illegible] చూస్తుంటే— అద్దంలాంటి గో[illegible] ఆ గర్భగుడి గోడలు—అన్ని కోణాల్లోం! [illegible] ఆకారమే కనిపించింది.

గుడిలోకి [illegible] ప్రయత్నం ఉండో లేకో

నిస్స్వార్థం అధికలాభం చేకూర్చుతుంది. కాని దానిని అలవరచుకొనేపాటి ఓరిమి మనుష్యులకు లేదు.

—స్వామి వివేకానంద

ఓ ఆకారం ప్రవేశించేసరికి, ఖంగారు పడిన నేను, అది నా కలల్లో గుడి అని మరిచిపోయి, అమాంతంగా రెండు చేతులూ ఎత్తి దండం పెట్టేశాను! ఇంకేముంది? అక్కడే నిలిచిపోయిన ఆ ఆకారం నా నమస్కారాన్ని చూస్తూనే దైవాకారం దాల్చి చిరస్థాయిగా నిలిచిపోయింది. ఇంక ఏంచెయ్యను? ఇదీ ఒక ఐతిహ్యం నా వూహాలో.

నీ వూహాలో...నేంచెప్పనా? తుపాకీ—కత్తీ—మూడు మణుగులుండే బూటూ కనిపిస్తూంటాయి నీకు! అసలు ఇక నా సంగతి చెప్పనా? అసలు కంటే తాజాకు ఎక్కువ! అంటే, అసలు తక్కువా, పి. యస్. ఎక్కువా అని అర్థం! ఉంటానోయ్.

నీ
హేమ."

ఇది ఆమె మొదటి ఉత్తరం. సుబేదార్ సింగ్‌కు నవ్వు వచ్చింది. నవ్వు తెర నాలుగో ఉత్తరాన్ని జ్ఞప్తికి తెచ్చింది. ఏం విచిత్రంగా వ్రాసేదో ఆమె! నవ్వు వచ్చేది.

"మై సోల్ఫ్ ఐడల్,

నమస్కారాలు గానీ, ఇంకా ఇంకా రాసేదు బావా హేమ్లెట్ ఒఫీలియాకు! చెప్పనా? వద్దూ. అయితే చెప్పేస్తున్నాను. 'అండ్ ది మోస్ట్

# దీపం పురుగులు

బ్యూటిఫైడ్ ఒఫీలియా!' అన్నాట్ట. ముందర వాక్యంతో ముగించినందుకు నాకు ధన్యవాదాలర్పిస్తున్నాననుకుంటాను. మంచిది. స్వీకరిస్తున్నాను.

ఇంతకీ ఈ ఉత్తరం చదవడానికి అభిమానం వెయ్యటల్లేదూ? ఉత్తరాలు వ్రాసే ఓపిక లేనివాళ్లకి చదివే అర్హతా లేదుట. అంతేమరి. రాజాకీ, పేదకీ ఒక్కటే శిక్షనాపాలనలో. ఏమిటి బావా లేకపోతే, నా మొదటి ఉత్తరానికే జవాబేది? ఒక్కసారి తారీఖు చూడు పోనీ....నీవు తారీఖు లెక్కలు మర్చిపోయావా ఏమిటే కొంప దీసి—గుడారమేసి. అంటే...కోపగించుకోకు..... గుడారాల్లో ఉండే మీకు కేలండర్లుండవుగా... మానాన్న గార్చి పూర్వకాలం వాళ్లు వూర్కే గొప్పగా చెప్పేరు కానీ—

"నిశ్శబ్దం అంటే నాకు చాలా భయం బావా. అర్థరాత్రివేళ ఒంటిగా కూర్చుంటే మరీ భయం!! ఇక్కడ నీవు లేవనీ, నేను ఒంటి



దాన్నే అనీ, ప్రతి వస్తువూ, ప్రతి సంఘటనా గుర్తు చేస్తుంటే ఏంచెయ్యను? ఒక్కోసారి పిల్లగాలి మెల్లిగా వచ్చి, 'నీకు తోడులేదు' అంటూ చెవిలో చల్లగా చెప్పి జారుకుంటుంది.

చంద్రుడు మబ్బు పరదాల్లో దాక్కునే కర్మ నాకు లేదిప్పుడు. నీ రాజా లేడుగా? నేనే రాజుని ఈ రాజ్యానికి అంటూ బయటికి వచ్చి అర్థరాత్రి దొంగతనంగా గుర్తుజేసి పారిపోతూంటాడా!

మల్లెలూ, విరజాజులూ సంతోషంతో వికసించబోయి—నన్ను చూస్తూనే ఆగిపోయి గుసగుస లాడుకుంటున్నాయి!!

ఇంతకీ ఇదంతా ఎందుకు వ్రాస్తున్నాననుకుంటున్నావ్? ఈ టైములో నీ ఉత్తరం ఒక్కటి ఉంటే వీళ్లందరికీ ఎంత చక్కగా జవాబు చెప్పేద్దునూ? మరి దీనికైనా జవాబు వ్రాయాలబ్బా తప్పకుండా...అదీ సంగతి..... ఏదీ? నవ్వాలి మరి.

మొన్న నో విచిత్ర సంఘటన జరిగింది. వ్రాయనా? వ్రాయలా? వ్రాయనుపో...బతిమి లాడితే వ్రాస్తాను...పోన్లే వ్రాస్తున్నా విను!

"నేను మొన్న డాబా పిట్టగోడ దగ్గర నించుని ఉంటే, అక్కడ ఆ టైములో ఏం చేస్తున్నానని అడుగుతున్నావా? అది తర్వాత సంగతిలే—అప్పుడు రెండు ఆరుద్ర పురుగులు గమ్మత్తుగా సంభాషించుకున్నాయి. 'పురుగుల భాష నీ కెల్లా తెలుసూ?' అంటున్నావు, నీ దగ్గరే ఉన్న నా హృదయంతో....అందుకని నేను జవాబు రాస్తున్నాను.

"ఒకవేళ నీ పై ఆఫీసరుని మన ఇంటికి ఎప్పుడైనా తీసికొస్తావనుకో...మరి వాళ్లతో ఆ (పురుగుల) భాషలో మాట్లాడవద్దూ? అందుకనీ నేర్చుకున్నానులే. పురుగులు మాట్లాడుకున్న విషయం వచ్చే ఉత్తరంలో పూర్తి చేస్తా.

నీ
హేమ."

పి. ఎస్.

"అసలూ—ఈ తాజాకలం లేకుండా వ్రాయ(లే)ను. ఒకే వాక్యం వ్రాస్తున్నా ఇందులో—జవాబు తిరుగు టపాలో రావాలి మరి! ఇంతే,

నీ
హేమ."

ఇల్లాగే నవ్విస్తూ, కవ్విస్తూ వ్రాసే దామె ఉత్తరాలను.

* * * *

ప్రకృతి కదలడానికి భయపడిన ఘట్టాలేవైనా అసలు ఉన్నాయా అని ప్రశ్నిస్తే ఉంటాయేమో...అని సందేహంగా జవాబు వస్తుంది. ఎందుకంటే, వరదల్లో కొంపలను, జీవులను కొట్టి పారెయ్యగల ప్రకృతి—గాలి దుమారాల్లో దుమ్మునూ, ధూళినీ వూడ్చిపారెయ్యగల ప్రకృతి—తుఫానుల్లో బీభత్సాలు సృష్టించగల్గే ప్రకృతి—భయపడి స్తంభించిపోగలదని ఎవరైనా అనుకుంటారా మరి!!

# ఆకాశ పుష్పానికి

## భట్టిప్రోలు కృష్ణమూర్తి

ఆకాశంపూవులు అందవన్న సంగతి అందరికీ తెలుసు—
అయినా వాటిని అందుకోవాలనే కాంక్ష కంటిలో నలుసు!
నా కళ్లు చింతనిప్పులటు మండుతున్నాయి ఎఱ్ఱగ వెఱ్ఱిగా—
నీకై నేను పడేబాధ తిరుగుతూంది వేయికాళ్ల జెఱ్ఱిగా!

* * * *

రా రమ్మని పిలుస్తూంది తిన్నగ కనిపించే ఈ ప్రక్కదారి—
ఆ స్వచ్ఛసరోవరంలో తేలే నీలిగల్వ పదను కటారి!
కాలుగాని అటుపడ్తే దిగపడ్తాయ్ సూదిముళ్లు కండలలో—
దిగానా ఆ కొలనులో దూసుకుపోతుంది బాకు గుండెలలో!

* * * *

కఱ్ఱలచితి పేర్చేందుకె ఎంచుతారు ఈ జాగా ఎవరన్నా!
ఈ మట్టిలోని అంతసారమూ ఎండినదని నే అనుకున్నా!
శ్రావణమాసం వానజల్లు బాణాలటు నీ చూపులు తగిలాయ్—
పచ్చదనం మంటలు ఎదకాల్చేస్తూ వేడివేడిగా రగిలాయ్!

* * * *

ఎందుకు నీ వెదురయ్యా వయిపోయిందనుకున్న ఈ దారిలో!
నీలంగా ఉన్న గోడల చీకటి బందికాన పొలిమేరలో?
ఎందుకలా నవ్వుతావు ఎగబోస్తూ పుచ్చపూల వెన్నెలలు?
ఏ సముద్రంలోనివి నీ రెప్పలుదాటి వస్తూన్న ఆ అలలు?

---

కానీ...స్తంభిస్తుంది!

గట్టిగా వీచడానికి కాదు...మెల్లిగా వీచడానికే భయపడుతున్నది గాలి.

కింకిలారావాలతో అంతవరకూ కలకలం చేసిన పక్షులు ఒకదానితో ఒకటి సంభాషించుకోవడానికి కూడా భయపడుతున్నాయి.

పువ్వు పువ్వుకూ తిరిగి మకరందాల్ని సేవించే భ్రమరం రెక్కలు కదల్చడానికి కూడా భయపడి అడ్డువచ్చిన ఆకుమీదే నిలిచిపోయింది.

మామిడి చిగుళ్లను తెగ తిని మత్తెక్కిన కోయిల గంభీరస్వరంతో మృదుత్వాన్ని మేళవించి ప్రకృతి గీతంలో పల్లవిని ఆలాపించడం ఆపేసి, ఏదో ఘోరవిపత్తును వినబోతూన్నట్లు చెవులు రిక్కించుకుని కూర్చుంది.

నిశ్శబ్దం రాజ్యం ఏలడమంటే ఇదే సుమా అని వెళ్లిపోతూన్న క్షణం వస్తూన్న క్షణంతో చెప్పుతూంది.

గంభీర నిశ్శబ్దంలో మార్దవంగల గొంతుక కూడా గంభీరంగానే వినబడుతున్నది...

"చూడు...మిస్టర్ రాంబాబు...నేను మనుష్యులను గౌరవిస్తాను. కానీ, ఆ గౌరవం ఒక్కోసారి మనుష్యులను దూరాల్లో నిలబెట్టినట్లుంటే కావలసిన వాళ్లని గౌరవిస్తూ దూరంగా ఉంచడం నాచేతకాదు. నేను నిన్ను ఏకవచనంలోనే పిలుస్తాను. నువ్వూ అలాగే పిలిస్తే సంతోషిస్తాను.

నన్ను నువ్వు చూసింది చాలా తక్కువసార్లు. నేను ఏ విధమైన డ్యూటీలో ఉంటానో మీకెవరికీ తెలియదు...తెలిస్తే...రాంబాబూ! నన్ను అసహ్యించుకున్నంతగా మరే జీవినీ అసహ్యించుకోరు మీరు. మీకు వచ్చే ఉత్తరాలన్నిటినీ జాగ్రత్తగా విప్పి, చదివి, బాధ కలిగించేవి ఉంటే చింపి పారేసే పని నాది!!

వూ! దూరంగా జరుగుతున్నావా? నీ తప్పులేదు. అవును మరి. కసాయివాడు నేను నాకంటె! నేను చేస్తున్న పని నాకే వెగటు కలిగించేది. మరి ఇంక, అసలు సంగతిలోకి వస్తున్నా....

మరీ—మరీ—హేము అనే సంతకంతో నీకు వచ్చే ఉత్తరాలు—అదిగో అప్పుడే కళ్లు ఎఱ్ఱబడిపోయాయేం? నిమిషాల్లో మీకు ఉద్రేకం తెప్పించి భావిపౌరుల ఔన్నత్యాన్ని కాపాడుకుంటారు మీ పైవారు. మన వాళ్లనీ, మనల్నే ఆశ్రయించుకుని బ్రతికేవాళ్లనీ, మనం రక్షించుకోలేక, వాళ్లకి కనీసం పట్టెడన్నం పెట్టాలనే ఆశతో వాళ్ల రక్షణని సర్వేశ్వరుని చేతిలో పడేసి ఇక్కడ ఉంటున్నాం. ఇంట గెలవకుండా రచ్చ గెలవడం అంటారే...అదే ఇది... నాకు కూడా, నీలాగే, నన్నే నమ్ముకుని, అయినవాళ్లందరూ వదిలెయ్యగా, నేనే తన సర్వస్వం అని బ్రతికే ఇందిర ఉంది.

ఒక్కో నక్షత్రం తీరు అలాంటిది....నా ఇందిరని తల్లిదండ్రులు చిన్నతనంలో అలక్ష్యంగా గాలికే వదిలెయ్యడం వలన ఎక్కడో పడి, చెయ్యి విరగకొట్టుకుందిట! గతిలేక పాపం... చివరికి గతిలేకుండా పడి ఉన్న నా కిచ్చి చేతులు దులుపుకుని వెళ్లిపొయ్యారు. మా పెళ్లయ్యాక నా ఇందిరకు 'అమ్మా, నాన్న' లని చూసే అదృష్టం కూడా లేకపోయింది. పట్టెడన్నం పెట్టలేని దౌర్భాగ్యస్థితి నన్నీ పనికి ప్రోత్సహించింది. ఆ విషయం తెలిసిననాడు నా ఇందిర నన్ను కావిలించుకుని ఎంత ఏడ్చిందీ మీ రెవరైనా వూహించగలరా? మీ వూహాకందనిదది!!

నన్ను ఆ ప్రయత్నాలనుంచి మానుద్దామనే ఆమె ప్రయత్నాలు అన్నీ విఫలాలైపోయాక, ఏదీ చెయ్యలేని స్థితిలో, నిర్లిప్తత నవలం బిస్తాడే మానవుడు, అల్లాగ నిస్తబ్ధురాలై పగలంతా గడిపింది, మరో రెండు రోజులలో నా ఎడబాటు సమీపిస్తోందనగా!

చీకటిపడేవేళకి ఏం చెయ్యాలో తెలియక తన స్నేహితురాళ్లని ఇంటికి ఆహ్వానించి, ఆ రాత్రంతా వాళ్లతో గడిపి వెయ్యాలనీ, అప్పుడైనా కనీసం నేను లొంగుతాననీ వూహించింది. గుప్పెడు మెతుకులను కాళ్లదగ్గరపడి ఉండేకుక్కకి విదిలించినట్లు విదిలించి నా ప్రక్క సవరించి నన్ను గదిలోకి తరిమేసింది. ఆమె తన స్నేహితులతో కాలక్షేపం చేస్తూ అర్ధరాత్రి వరకూ గడిపింది, వాళ్ల మధ్యగా తన ప్రక్క కూడా పరుచుకుని.

రాత్రి లైటు గుడ్డి వెలుతురులో గదిలో కుక్కిమంచంలో కూర్చుని ఎదురుగా కిటికీలోంచి గదిలోని వెలుతురుతో పోటీ పడుతూన్న మసక వెన్నెలని చూస్తూ కూర్చున్నా.

ఆమె రాలేదు....నాకు తెలుసు రాదని.... కుక్కి మంచంలో నడుం వాల్చి ఆలోచిస్తున్నా. ఇంతలో సుడిగాలిలా గదిలోకి ప్రవేశించి, నామీద వాలిపోయింది వెక్కుతూ!!

'తిండి లేకపోయినా నీ సమక్షంలో గడుపగలను—



బ్రతుకు బాట        పేపర్ కట్టింగ్—ఎ. వి. ఎస్. ఆర్. జోశ్యులు (మంగళగిరి)

నేను బ్రతకలేను మీరులేందే—

మీరు ఇక్కడ లేకపోతే—ఎలా ఎలా?' మాటలని దుఃఖం మింగేస్తోంది! ఆపుకోలేక గట్టిగా ఏడుస్తూ అడిగింది.

పసిపిల్లాడిని సముదాయించలేను—

నిజ్ఞాని మాటకీ బదులు చెప్పలేను—

ఆమెని గట్టిగా హృదయానికి అదుముకుని పెదాలతో కన్నీళ్లని తుడవడం తప్ప ఏమీ చెయ్యలేకపోయాను ఆనాడు." చిన్న పిల్లాడిలా కన్నీళ్లు కారుస్తున్నాడు సుబేదార్ రావ్‌సింగ్. వెక్కిళ్ల నుండి కోలుకుని—

"ఆ...అసలు సంగతి. నీ విషయంలోకి వద్దాం. అరే! నీ కళ్లమ్మట నీళ్లు కారుతున్నాయేం? నా గాథ వినే? బాధపడకు. ముందర నీ విషయం ముఖ్యం. కొన్ని కొన్ని విషయాలు మాట్లాడుకోవడంవలన కష్టనష్టాలకంటె లాభాలే ఎక్కువగా ఉంటాయి బేరీజువేసి చూస్తే.

నీ హేము వ్రాసిన ఉత్తరాలన్నీ నీకు అందజేయలేదు నేను. ఎటొచ్చీ అందరి ఉత్తరాల్లా చింపి పారెయ్యకుండా జాగ్రత్తగా దాచేను. నీకు అందజేసిన కొన్ని ఉత్తరాలకే బహుశా నీవు జవాబు వ్రాయలేదేమో? పదిరోజుల క్రితం ఆమె దగ్గరినుండీ పెద్ద ఉత్తరం వచ్చింది. అందులో ఆ ఉత్తరానికి నీనుండి జవాబు రాకపోతే బ్రతకనట్టు సూచించేసరికి కంగారు పడిన నేను, నువ్వు వ్రాసినట్లుగా వ్రాద్దామని ఓ జవాబు వ్రాసేను నాలుగు వాక్యాల్లో...దానికి వచ్చిన జవాబిది!" అంటూ జేబులోంచి ఓ కాగితాన్ని తీసి రాంబాబుకు అందించాడు సింగ్.

"బావా,

నమస్కారాలు గానీ, నువ్వేనా అసలు? నా బావనే ? ? అదేమిటి బావా హేమూ అని పిలిచేవ్? నీవు పెట్టుకున్న పేరు మరిచిపోయేవా? బాగా మారిపోయావ్...మారని నువ్వూ, నేనూ ఒకటే గానీ, మారిన నువ్వూ, నేనూ ఒకటిగా కాలేము. ముందుగా వెళ్లిపోతున్నా. మారని నీకోసం ఎదురు చూస్తూంటా పై లోకాల్లోంచి ! !

# దీపం పురుగులు

ఎంత మారినా నిన్ను చూడందే ఈ బొందెని జీవం వదలదేమో? నువ్వు వెనకటి నా వాడివి కాదు. మారిపోయావా? ఇంకేం చూసుకుని బ్రతకనూ? పోయింది ఆశ! ఒక్కసారి రా బావా? నీకు ఇష్టం లేకపోయినా, ఒక్కసారి కడసారి చూపు దక్కించు. ఇంకే కోరికా లేదు.

ఎవరిదాన్నని చెప్పుకోను?
ఎవరికోసం బ్రతకను ?
హేము."

ఉత్తరం పూర్తి చేస్తూనే జుట్టు రెండు చేతులతోటి పీక్కుంటూ "మీకోసం నా శారదని దూరం చేసుకున్నాను. ఈనాడు నా శారదని నాకు కాకుండా చేస్తున్నారా?" అంటూ రాంబాబు ఒక్కసారిగా తల నేలను కొట్టుకుంటుంటే సింగు పట్టుకుని ఆపి, రాంబాబు కళ్లల్లోకి చూస్తూ కూర్చున్నాడు ! !

ఉద్రేకం తగ్గి వెక్కి వెక్కి ఏడుస్తూన్న రాంబాబును చూసి, "మీ ఆఫీసరు నాకు స్నేహితుడు. నీవు రెండు నెలలు సెలవు పెట్టు, ఆరోగ్యం బాగాలేదని. మీ డాక్టరుచేత నేను సర్టిఫై చేయిస్తాను. నా దగ్గర రెండు వందలు పుచ్చుకుని ఈవేళే బయలుదేరు." చెప్పాడు సుబేదార్ రావ్‌సింగ్.

*　　*　　*　　*

ఎక్కడి అస్సాం? ఎక్కడి ఆంధ్రప్రదేశ్??

బస్సు దిగుతూనే, మతి స్తిమితం తప్పినట్లు పరుగెడుతూన్న ఆ ఆకారాన్ని చూస్తూనే కొత్తపేటలోని పిల్లలు మరో పిచ్చాడు దిగేడని అరుస్తూ పారిపోయారు.

చెదరిపోయిన జుట్టూ—
మాసిపోయిన బట్టలూ—
పెరుగుతూన్న గడ్డమూ—
నీరసంగా వాడిపోయిన ఆకారమూ—

చూస్తుంటే విమానాలూ, రైళ్ళూ, లాంచీయా, బస్సూ ఎక్కి దిగి వచ్చినట్లు అనిపించడం లేదు. ఎంతదూరంనుండి—ఎన్ని బండ్లు మారివచ్చినా 'అతీ—గతీ' లేని వాడిని ఎదురొచ్చి రిసీవ్ చేసుకునే వాళ్లు మాత్రం ఎవరూ?

పోర్టికో ముందు ఆగి, ఎదురుగా పైన టెర్రేస్‌మీద నిలబడి మాట్లాడుకుంటున్న రెండు ఆకారాలను ఒకటి తన మామయ్యగా, రెండవది చేతిలోని స్టెతస్కోపునుబట్టి డాక్టరుగా ఊహించి లోపలికి దూకేడు సంతోషం మిళితమైన కంగారులో రాంబాబు....

పరుగెట్టుకుంటూ లోపలికి దూసుకు పోతూన్న ఆకారాన్ని చూసి మొరగబోయిన జాతి కుక్క ఆగిపోయింది ఏమాలోచించిందో, ఏమో?

మాట్లాడుకుంటున్న ఆ ఇద్దరు వ్యక్తులకూ ప్రక్కనే మరో వ్యక్తి నిలబడినట్లు కూడా తెలియదు. "మన స్పృహలోకి ఇప్పుడప్పుడే రాదు మీ అమ్మాయి. బహుశా తెల్లవార వచ్చిందే." డాక్టరు అభిప్రాయం అది.

దిగాలుగా నిలబడి వింటున్నారు శివకామయ్యగారు.

ఫరవాలేదు. నా సమక్షంలో నా శారదని బ్రతికించుకోగలను అనుకుంటూ అలవాటుగా శారద గదిలోనికి పరుగెత్తిన రాంబాబు మంచాన్ని అంటిపెట్టుకుని పడున్న శారదను చూస్తూ, నిర్ఘాంతపడిపోయి, తల తిరిగి పడిపోబోయి, ద్వారబంధాన్ని పట్టుకుని ఆపుకున్నాడు. ఇదే ద్వారబంధాన్ని ఆలవాలం చేసికొని తన శారదను తనివితీరా చూసుకుంటూ నిలబడిన క్షణాలెన్నో.

గతంలోకి దూసుకుపోయింది మనస్సు, జరీ సరదాలను తప్పించుకుంటూ.

చక్కనమ్మ చిక్కినా అందమే అంటారు. పచ్చటి మేలిమి చాయ మరీ వలచబడి పాలిపోయినట్లుంది! నాజూకైన శరీరం చిక్కిపోయి మంచాన్ని అతుక్కునిపోయింది ! ! తైల సంస్కారంలేని బారెడు జడ ప్రక్కగా వడేసినట్లు తలగడామీదినుంచి పందిరిమంచం క్రిందగా వ్రేలాడుతున్నది. భుజాలవరకూ రగ్గు కప్పుకుని స్మృతిలేకుండా పడి ఉన్న శారద నుదుటిమీద తిలకం మెరుస్తున్నది. ఫాలభాగాన్ని ఆశ్రయించుకున్న చిరు వెంద్రుకలు గాలివాలుగా ఊగిసలాడుతున్నాయి. రెండుచేతులనూగుండెలమీదుంచుకుని అతి సుకుమారంగా పడుకుని ఉన్న ఆమెను చూస్తూ పరిస్థితినీ, పరిసరాలనూ క్షణంసేపు మరిచిపోయింది రాంబాబు మనస్సు.

'స్పృహ తెల్లవారే వరకూ రాదన్నాడు డాక్టరు'—జ్ఞాపకశక్తి హృదయాన్ని హెచ్చరించింది...

మెల్లిగా చప్పుడు కాకుండా వెళ్లి ఆమె తలను నిమురుతూన్న మరుక్షణంలో శారద 'బావా...' అంటూ కళ్లు తెరిచింది!

ఏడాదినుంచీ దేన్నో వెతుకుతూన్న రెండు జతల కళ్లూ వీటినే సుమా—అనుకుని అక్కడే ఆగిపోయాయి ఒకదాన్నొకటి చూసుకుంటూ.

మాటల అలికిడికి కునికిపాట్లు పడుతూన్న పనిమనిషి ఉలిక్కిపడి కళ్లు తెరిచి 'అమ్మాయి గారికి మతి వచ్చిందంటూ' బయటకు పరుగెత్తింది కంగారులో...

ప్రక్కగదిలోంచి కామేశ్వరమ్మ ఎక్కిళ్లు వినిపిస్తూనే ఉన్నాయి.

పనిమనిషి మాటలు విని ఆ దిక్కుగా వచ్చిన శివకామయ్యగారు, డాక్టరుగారూ, కామేశ్వరమ్మా శారద ప్రక్కగా కూర్చుని తల నిమురుతూ ఆమె కళ్లల్లోకి చూస్తూ కళ్ల నీళ్లెట్టుకుంటూన్నపిచ్చిఆకారంలోని మేనల్లుడినీ, ప్రాణాలను కళ్లల్లో ఉంచుకుని "బావా!" అంటూ అతనివైపు చూస్తున్న తన కూతురి మొహంలోని వేయిజ్యోతులనూచూసి, గుండెలను పిండేసే ఆ దృశ్యం చూడలేక, గుండెలను చేత్తో పట్టుకుని ప్రక్కగా వెళ్లిపొయ్యారు.

"శరీరం ఎంత చిక్కిపోయినా బావా—స్పర్శ జ్ఞానమాత్రం పోలేదు! అందుకే నన్ను నీవు స్పృశిస్తూండగానే స్పృహలోకి రాగలిగేను—" కళ్ల నీళ్లు కణతలమీదనుంచి జారి తలగడాలోకి ఇంకిపోతున్నాయి.

తన తల నిమురుతూ అశ్రువులను ఏక ధారగా కారుస్తూన్న అతని కళ్లల్లోకి చూస్తూ, తన బలహీనమైన చేతులతో అతని కళ్లను తుడుస్తూ, "దేనికి బావా, బాధపడడం! మనం కావాలనుకున్నదేగా...కోరుకున్నదే జరిగింది....... అయినా బావా? నీకు కోపం రాకుండా ఉంటే, నువ్వెక్కడా మారినట్లు లేవేం బావా? మరి అల్లా రాసేవేం నాకు? నువ్వే చెప్పు ఎంతోకాలం అప్పలు వ్రాయకుండా గడిపి అల్లాంటి ఉత్తరాలు వ్రాస్తే అబలనికదా భయపడిపోనూ మరి? పరీక్షిద్దామనుకున్నావా? విధి చేస్తున్న పరీక్షలకే విసిగిపోతున్న నేను—చివరికి నీవు కూడా పరీక్షిస్తుంటే నిలవలేకపోయాను...క్షమించు...

అవునూ—నాకేసి చూస్తున్నా బాధపడ వలసిన అవసరం ఏమొచ్చింది?

నవ్వు మరీ...నవ్వాలి బాబూ...నీకు తెలియదు బావా నవ్వులోని తమాషా—

నవ్వులో వెన్నెలలు విరుస్తాయి—
పువ్వులు పూస్తాయి—
అమృతధారలు కురుస్తాయి—

ఈ టెక్నిక్ తెలుసుకున్నారు కాబట్టే దేముళ్ల ఫొటో తీసేటైముకి నవ్వు మొహం పెట్టేస్తారు. అందులో పరమశివుడు మరీనూ—అంత కోపిష్టి కూడా మరి ఫొటోల్లో నవ్వడంలోని అంతర్యం నీకు తెలుసునా? బాధలని మురిపించి మరిపించేదే అది!!

నీరసంలో కూడా ఇంతగా మాట్లాడుతున్నానేమిటే అనుకుంటున్నావా? సంతోషం ఎన్నిరకాల పనులైనా చేస్తుంది, చేయిస్తుంది. అయినా బ్రతకనేమో అనే భయంతో వచ్చే జన్మలో నిన్ను తిరిగి కలుసుకునే వరకూ సరి పడా..." తన నోటిని మూయబోతూన్న అతని చేతులను పట్టుకుని ఆపి,

"మాట్లాడనియ్యి బావా. నామీద నాకే నమ్మకంలేదు. ఓసారి నేను కిటికీలోంచి బయటకు చూస్తూ నిలబడినప్పుడు నా జడని పట్టుకున్నావనీ, కుర్చీలో కూర్చుని వంగుని డ్రాయరు మీద తలవాల్చినిద్రపోతున్నప్పుడు అరచేతినిముద్దు పెట్టుకున్నావనీ నిన్ను తిట్టేను. గుర్తుందీ? నావల్ల నీకు అన్నీ కష్టాలేగానీ...ఎన్నడూ...సుఖాలే లేవు. క్షమించు. కడుపులో ఎల్లాగో ఉంది బావా. ఎన్ని జన్మలకైనా నన్ను నీదాన్నిగా ఎంచుకో. బావా...వెళిపోతున్నాను..." మీదికి వంగుని తన కళ్లల్లోకే ఆతురతగా చూస్తున్న రాంబాబు కళ్లను చూస్తూనే కళ్ళు మూసేసింది.

"శారదా..." పిలిచేనని అనుకున్నాడు గానీ... కంఠం బయటికి రానేలేదు.

* * * *

"స్మృతి రాదనుకున్నాను. ఇది చాలా చెప్పుకోదగ్గ సంగతి. అతని స్పర్శతో స్మృతి వచ్చింది. వయసుమళ్లిన వాళ్లకి ఇలా ఎవర్నయినా చూడాలని ఉంటే ప్రాణం చూసేవరకూ ఆగడం నా అనుభవంలోనిది ఇన్నాళ్లూ. కాని, వయసులో ఉన్నవాళ్లకి మనిషికోసం ప్రాణం ఆగడం ఇదే మొదలు. నే వెళ్లొస్తాను..."

వెళ్లిపోతున్న డాక్టరును ఆపి శివకామయ్యగారు "మీ ఫీజుసంగతి మరిచిపోయినట్లున్నారు?" అని అడిగిన దానికి, "క్షమించండి...మూసుకుపోయిన నా కళ్లని—డాక్టరుగా ఉండీ అంధుడినైన నా కళ్లని—సర్జరీ అవసరం లేకుండా విప్పిన దేవత మీ అమ్మాయి. పుట్టింటిలో పడి ఏడాదినుండీ ఏడుస్తూన్న నా భార్యను తెచ్చుకునే రోజు ఈవేళ....నేనే మీకు నిజానికి ఋణపడి ఉన్నాను. క్షమించాలి. టైము లేదు." డాక్టరు కారు గేటు దూసుకుని వెళ్లిపోయింది వేగంగా....

ఎదురింటి అమ్మాయిలు ప్రమిదలతో అరుగులనూ, మేడ పిట్టగోడలనూ, కిటికీలనూ అలంకరిస్తున్నారు....ప్రమిద వెలిగించిన కొన్ని క్షణాల్లోనే పురుగులు చేరుతున్నాయి అక్కడకి.

కొన్ని పురుగులు దీపపు వేడికి కాలి మసి అయిపోతున్నాయి. మరి కొన్ని ప్రమిదల్లోని నూనెలో పడి చచ్చిపోతున్నాయి. మిగిలినవి రెక్కలో, కాళ్లో కాల్చుకుని నేలమీదికి రాలిపోయి కుంటుకుంటూ, ఎగరలేక, అల్లాగే ప్రాక్కుంటూ బ్రతుకుతాయి.

ఇప్పటివరకూ దీపపు కాంతిలో ఏ పురుగూ ఐక్యం కాలేకపోయింది. అయినా, దీపం చుట్టూ పురుగులు చేరుతున్నాయి. కాలుతూనే ఉన్నాయి. ప్రాణాలు విడుస్తూనే ఉన్నాయి. ఇదే ప్రేమకు తార్కాణం. ఇందులో జయించినవాళ్లు లేరు. ప్రేమలో పడనివాళ్లు లేరు. కొంతమంది బలైపోతారు; మరికొంతమంది జీవితం అంతా దేన్నో పోగొట్టుకున్న వాళ్లల్లాగ తెలియనిదాన్ని వెతుక్కుంటూ గడిపివేస్తారు. ★

